క్లుప్తంగా

ఓటు నమోదుపై అవగాహన

పోలవరం రూరల్: ఓటరు నమోదుపై పోలవరం జూనియర్ కళాశాలలో సోమవారం తహసీల్దార్ ఆర్ఎస్ రాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లు నిండినవారు నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు వినియోగించుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటరు నమోదుపై స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి

బుట్టాయగూడెం: సీపీఎం జిల్లా 26వ మహాసభలు బుట్టాయగూడెంలో డిసెంబర్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారామ్ తెలిపారు. మహా సభల సన్నాహక సమావేశం సోమవారం పార్టీ మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అధ్యక్షతన బుట్టాయగూడెంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీప్రాంతంలో 35 ఏళ్లుగా భూ ఉద్యమం నేపథ్యంలో బుట్టాయగూడెంలో సభలు నిర్వహించడం శుభ పరిణామం అని అన్నారు. డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో జరిగే మహాసభలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో తామా ముత్యాలమ్మ, అందుగుల ఫ్రాన్సిస్, ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవం

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలో ముస్లిం సోదరులు గ్యార్వీ షరీఫ్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఇస్లాం సంవత్సరంలోని నాలుగవ నెల అయిన గ్యార్మీ రబీఉల్ ఆఖర్లో జరుపుకునే ఈ పండుగ సందర్భంగా, ముస్లిం సోదరులు జెండాలతో, మేళతాళాలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సాయంత్రం మసీద్ సెంటర్ దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడమేకాక, సుమారు 2000 మందికి అన్నదానం చేసి ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు.

శంకుస్థాపనలు

కామవరపుకోట: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ శంకుస్థాపన చేశారు. తడికలపూడి, వీరిశెట్టిగూడెం, ఆడమిల్లి, తాడిచర్ల, గుంటుపల్లి, ఉప్పలపాడు, రావికంపాడు గ్రామ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రూ.5 కోట్ల 19 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, మండల టీడీపీ అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విర్డ్‌లో శస్త్రచికిత్సలు



రోగికి కృత్రిమ అవయవాన్ని అందిస్తున్న వైద్యులు

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ప్రముఖ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్లు డాక్టర్ కృష్ణకిరణ్, డాక్టర్ నీల్‌శీత్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 20 మంది రోగులను పరీక్షించి 8 మందికి తుంటి, మోకాలు శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఆస్పత్రిలో ప్రోస్తాసిస్ 3డీ ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలు, కాలిపర్స్‌ను 16 మంది దివ్యాంగులకు అందజేశారు. గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎంఎం గుప్తా సహకారంతో ఈ కాలిపర్స్ తయారు చేసినట్టు వైద్యులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో విర్డ్ ఆస్పత్రి చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకరరావు, వెంపరాల నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణంలో తిప్పలు



కొయ్యలగూడెం బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

కొయ్యలగూడెం: దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో తిరుగు ప్రయాణానికి ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. సోమవారం కొయ్యలగూడెం బస్టాండ్ నుంచి సకాలంలో బస్సులు లేక గంటల తరబడి ప్రయాణికులు వేచి ఉండాల్సి వచ్చింది. గత సీజన్లో దసరా సందర్భంగా ప్రభుత్వం అదనపు సర్వీసులను నడపగా ఈ దఫా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. పిల్లాపాపలతో గమ్యస్థానాలను చేరుకోవడానికి ఆటోలను ఆశ్రయించగా అసలుకు రెండింతలు ఆటోవాలాలు వసూళ్లు చేశారు. రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం పోలవరం, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, పట్టణాలతో పాటు హైదరాబాదు వైజాగ్ సుదూర ప్రాంతాలకు చేరుకునే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే అదునుగా సందట్లో సడేమియా అన్నట్టు ప్రైవేటు బస్సులు అసలుకు రెండింతలు చార్జీల మొత్తంలో వసూలు చేశారు.

పేకాటపై దాడి

జంగారెడ్డిగూడెం: స్థానిక మార్కండేయపురం శివారులో పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఈ దాడిలో ఐదుగురిని అరెస్టు చేసి రూ.4,600 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బండ్రేవు వంతెన నిర్మాణం ఎప్పుడో?

- దశాబ్దాలుగా కలగా మారిన వంతెన నిర్మాణం
- రహదారి సౌకర్యం లేక రైతుల ఇబ్బందులు



ఎర్రకాలువపై బండ్రేవు వంతెన నిర్మించాల్సిన ప్రదేశం ఇదే

టి.నరసాపురం: ఎర్రకాల్వపై బండ్రేవు వద్ద వంతెన నిర్మాణం రైతుల కలగానే మిగిలిపోయింది. మూడు దశాబ్దాలుగా రైతుల కోరిక చిరకాల వాంఛగానే మిగిలిపోతుంది. ప్రభుత్వాలు మారుతున్నా సమస్య పరిష్కారానికి ఏ ప్రజాప్రతినిధి చొరవ చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. టి.నరసాపురం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులకు ఎర్రకాలువ అవతలి వైపు 3 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఆయా భూముల్లో పామాయిల్, కొబ్బరి, మామిడి, జీడిమామిడి, వరి, మొక్కజొన్న, పొగాకు వంటి పంటలు పండిస్తున్నారు. ఈ ప్రాంత రైతులు నిత్యం వారి పొలాలకు ఎర్రకాలువ దాటి వెళ్లాల్సి ఉంది. వర్షాకాలంలో ఎర్రకాలువ ప్రవాహం ఉధృతి ఎక్కువగా ఉన్న సమయంలో రైతులు పొలాలకు వెళ్లి రావడానికి వీలు లేకుండా ఉంటుంది. రైతులు పండించిన పంటలను మార్కెట్‌కు తరలించడానికి, ఇంటికి తెచ్చుకోవడానికి ఎరువులు, పురుగుమందులు పొలాలకు తరలించడానికి ఎర్రకాలువ దాటాల్సిందే. బండ్రేవు వద్ద రైతులు తాత్కాలికంగా ఎర్రకాలువకు అవతలి వైపునకు వెళ్లి వచ్చేందుకు గ్రావెల్‌తో తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేసుకుంటున్నారు. వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడు నీటి ప్రవాహ ఉధృతికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. బండ్రేవు వద్ద ఎర్రకాలువపై వంతెన నిర్మించాలని రైతులు గత 30 ఏళ్లుగా కోరుతూనే ఉన్నారు. ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. అయినా ఈ సమస్యపై ఎవరూ దృష్టి సారించలేదు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి ఇక్కడ పైపు వంతెన నిర్మించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించాలంటే బండ్రేవు వద్ద ఎర్రకాలువ వంతెన ఎంతో అవసరం. వర్షాలు కురిసి కాలువ పొంగితే రాకపోకలకు అంతరాయాలు ఏర్పడుతోంది. వంతెన లేకపోవడంతో రైతులు తాత్కాలిక గ్రావెల్ రోడ్డు వేసుకుంటున్నారు. వర్షాలకు ఆ రోడ్డు కొట్టుకుపోవడంతో మరలా రోడ్డు వేసేంత వరకు రాకపోకలు కష్టంగా మారుతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఈ వంతెన నిర్మించాలి.

– దేవరపల్లి రంగారావు, టి.నరసాపురం

ప్రజా సమస్యలపై పోరాడాలి



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఏలూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దుర్గాప్రసాద్

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ఏలూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలపై పార్టీ శ్రేణులంతా కలిసి పోరాడాలని వైఎస్ జగన్ సూచించినట్లు దుర్గాప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ కారణంగా బెల్ట్‌షాపులు పెరిగిపోయి సాధారణ, దిగువ మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో బెల్ట్ దుకాణాలపై దృష్టి సారించాలని అధినేత సూచించినట్లు పేర్కొన్నారు.

గాది రాజేంద్రప్రసాద్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



రాజేందప్రసాద్ రెడ్డికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, నాయకులు

టి.నరసాపురం: ఎంపీటీసీ గాది రాజేంద్రప్రసాద్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మల్లుకుంటలో సోమవారం జరిగిన సంతాప రాజేంద్రప్రసాద్ రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రాజేంద్రప్రసాద్‌రెడ్డి సర్పంచ్‌గా ఎంపీటీసీగా ప్రజలకు సేవలందించారని, పార్టీ అభివృద్ధికి నిరంతరం పాటుపడేవారని కొనియాడారు. ఆయన భౌతికంగా లేకపోయినా అందరి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీనురాజు, నాయకులు తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, వాసిరెడ్డి మధు, బొంతు అంజిబాబు, పులగం వసంతకుమార్‌రెడ్డి, దోరపల్లి నరసింహారావు, గురజాల వీరవెంకటరావు, పలువురు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ధర్మాజీగూడెంలో (యు) ఆకారంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



ఈ మలుపులోనే ఏర్పడిన గుంతలు

యమ డేంజర్

- ప్రమాదకరంగా ధర్మాజీగూడెంలోని రహదారి మలుపు
- నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్న వైనం

లింగపాలెం: రహదారి మలుపులు ప్రయాణికుల పాలిట మృత్యుగండాలుగా మారుతున్నాయి. స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. ధర్మాజీగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్లే శివాలయం సమీపంలో (యు) ఆకారంలో ఉన్న మలుపు ప్రయాణికులకు, వాహనదారులకు శాపంగా మారింది. చింతలపూడి–ఏలూరు వెళ్లే ప్రధాన రహదారైన ధర్మాజీగూడెంలో ప్రమాదకరంగా ఉన్న ఈ మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈమలుపు వద్ద ఇటీవల ఒక కారు, బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న డ్రెయినేజీలోకి దూసుకుపోయాయి. దీంతో బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. బస్సు ఒరిగి ఆగిపోవటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడ స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు లేకపోవడంతో ఎందరో ద్విచక్రవాహనదారులు సైతం ప్రమాదాల బారిన పడి గాయాల పాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



ధర్మాజీగూడెం శివాలయం వద్ద యు ఆకారంలో ఉన్న మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ కనీసం స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– వెదురుపాక నాగేశ్వరరావు, ధర్మాజీగూడెం

అశోక్ మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటు



అశోక్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వనిత

కామవరపుకోట: అశోక్ శ్రీనివాస్ మృతి వైఎస్సార్ సీపీకి, ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని మాజీ మంత్రి తానేటి వనిత అన్నారు. ఇటీవల అనారోగ్యంతో కళ్ళచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత మేడవరపు అశోక్ శ్రీనివాస్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబ సభ్యులను సోమవారం వనిత పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి గెలుపునకు అశోక శ్రీనివాస్ ఎనలేని కృషి చేశారని, సొంత నిధులతో ఈ ప్రాంత ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలకు చేపట్టారని ఆయన సేవలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, ద్వారకాతిరుమల జెడ్పీటీసీ శామ్యూల్, వైఎస్సార్ సీపీ శ్రేణులు మేడూరి రంగబాబు, వాసు, కొత్తపల్లి శ్రీనివాస్, కొండపల్లి ధర్మరాజు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వనిత, రాజబాబు, తదితరులు

ద్వారకాతిరుమల: కోడిగూడెంలో మాజీ సర్పంచ్ చెలికాని రాజారావు (చిన్న రాజబాబు) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం మాజీ హోం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి రాజారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, చెలికాని బుల్లియ్య, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, యాచమనేని నాగేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, గోపా నాగేశ్వరరావు, దొప్పసాని రాంబాబు, ఆచంట రాకేష్, దాకారపు బంగారమ్మ, అగ్గియ్య, దాసరి ఏసురత్నం, దాసరి రాంబాబు, కుక్కల గట్టియ్య, పసుపులేటి ఏసుబాబు, భోగరాజు సాయికృష్ణ, ఉప్పలపాటి మునేశ్వరరావు తదితరులున్నారు.

సర్పంచ్ మృతికి సంతాపం

కుక్కునూరు: వింజరం సర్పంచ్ జగిడి బాలరాజు మృతికి వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం తెలిపారు. ఆదివారం రోడ్డు ప్రమాదంలో జగిడి బాలరాజు మృతి చెందారు. సోమవారం బాలరాజు భౌతికకాయాన్ని పార్టీ నేతలు సందర్శించి పూలమాలలు వేసి వీడ్కోలు పలికారు. ఎంపీపీ తాండ్ర రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు గాడిద రామచంద్రం, కుచ్చర్లపాటి నరసింహారాజు, కుచ్చర్లపాటి కృష్ణంరాజు, ఎల్లంకి లక్ష్మణరావు, సర్పంచులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

రీ సర్వే జరిపి వరద బాధితులను ఆదుకోవాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: విజయవాడ వరద బాధితుల నష్టపరిహారం కోసం రీ సర్వే జరిపి న్యాయం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కారం రాఘవ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కారం రాఘవ, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, ఉపాధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడలో వరదల కారణంగా పాయికాపురం, సింగ్ నగర్, వాంబే కాలనీ, ప్రకాష్ నగర్, రాజీవ్ నగర్, సుందర్యనగర్, కండ్రిక భవాని పురం తదితర ప్రాంతాలన్నీ పూర్తిగా నీట మునిగి 2.50లక్షల మంది ఇబ్బందులు పడ్డారన్నారు. బాధితులను ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటించినా వాస్తవ రూపంలో తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా సమగ్రంగా రీ సర్వే జరిపి బాధితులందరికీ పూర్తి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదల సమయంలో మంచినీరు, ఆహారం, పాలు తదితర నిత్యాసర వస్తువుల పంపిణీలో రూ. 500 కోట్లకు పైగా అవినీతి జరిగిందని వస్తున్న ఆరోపణలపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఈ.భూషణం, బన్నే వినోద్, పీవైఎల్ నాయకులు తగరం బాబురావు, ప్రముఖ న్యాయవాది యు.ఏసుబాబు. పీఓడబ్ల్యూ నాయకురాలు కె.రామలక్ష్మి, పూనెం రాముడు, కొమరం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు





జంగారెడ్డిగూడెం రూరల్: అమ్మవారి ఊరేగింపు నిర్వహించిన దృశ్యం
ద్వారకాతిరుమల: పంగిడిగూడెం పురవీధుల్లో దుర్గమ్మ ఊరేగింపు

జంగారెడ్డిగూడెం: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పట్టణంలో ఆటో నగర్‌లో మోటార్ ఫీల్డ్ వర్కర్స్ అండ్ ఓనర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారు ఊరేగింపును సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహిళలు కలశాలతో అమ్మవారికి స్వాగతం పలుకుతూ ఆటో నగర్ నుంచి గంగానమ్మ గుడి వరకు ప్రదర్శనగా వెళ్లి గంగానమ్మ అమ్మవారికి సారె, చీరలు సమర్పించి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వహించిన విచిత్ర వేషధారణలు, మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో కొలువై ఉన్న శ్రీరాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో పూజలందుకున్న అమ్మవారి ఊరేగింపు సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తుల భజనల నడుమ అమ్మవారి ఊరేగింపు ఘనంగా సాగింది. అర్చకులు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఊరేగింపు అనంతరం అమ్మవారి నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దల్లి గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వం.. దుర్గాదేవి గ్రామోత్సవం

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో శ్రీకృష్ణుని ఆలయం వద్ద నెలకొల్పిన దుర్గాదేవి ఊరేగింపు వేడుకను కమిటీ సభ్యులు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి నైవేద్యంగా ఏర్పాటు చేసిన లడ్డూ ప్రసాదాన్ని వేలంలో గ్రామానికి చెందిన యలమర్తి బాలకృష్ణ రూ.6 వేలకు దక్కించుకున్నారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి, గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి పంగిడిగూడెం వద్ద పోలవరం కాలువలో నిమజ్జనం చేశారు.

హంస వాహనంపై గ్రామోత్సవం

పోలవరం రూరల్: శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు కార్యక్రమాల్లో భాగంగా పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామంలో అమ్మవారిని హంస వాహనంలో ఏర్పాటు చేసి భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, వలవల బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.



పోలవరం: కొత్తపట్టిసీమలో హంస వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం



జంగారెడ్డిగూడెం: గంగానమ్మ ఊరేగింపులో కేరళ వాయిద్యాలు, వేషధారణలతో కళాకారులు



జంగారెడ్డిగూడెం: ఆటోనగర్ ఊరేగింపులో విచిత్ర వేషధారణలు

అమ్మవారి ఆలయాల వద్ద అన్నసమారాధనలు



జంగారెడ్డిగూడెం: కనకదుర్గమ్మకు మహానివేదన



కొయ్యలగూడెం: అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల: కుంకుళ్లమ్మ ఆలయం వద్ద..

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయం వద్ద సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. అన్నప్రసాదాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత కమిటీ సభ్యులు మారిశెట్టి రాధాకృష్ణ, మాడా రామ్మోహనరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆటోనగర్‌లో మోటార్‌ఫీల్డ్ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మకు మహానివేదన సమర్పించారు. పూర్ణకుంభం వేసి బూరెలు, గారెలు, స్వీట్లు, పిండి వంటలతో అమ్మ వారికి మహానివేదన చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కొయ్యలగూడెం: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం శ్రీ కొయ్యలగూడెం చక్ర సహిత కనకదుర్గ ఆలయం వద్ద మహా అన్న సమారాధన నిర్వహించారు. పాలక మండల చైర్మన్ సొసైటీ అధ్యక్షుడు మంతెన సోమరాజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 5 వేలకు మందికి పైగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గవరవరం గ్రామంలో అయ్యప్ప మాల దీక్షాదారులకు పండ్ల కొట్టు మణి భిక్ష కార్యక్రమం నిర్వహించి 250 మంది భక్తులకు భిక్ష ప్రసాదాన్ని అందజేశారు.

కుంకుళ్లమ్మ ఆలయం వద్ద..

ద్వారకాతిరుమల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ముందుగా అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, నివేదనలను సమర్పించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానికులతో పాటు, పలు ప్రాంతాల నుంచి క్షేత్రానికి వచ్చిన వేలాది మంది భక్తులు అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.